సాక్షి
వరంగల్
శుక్రవారం । 23 । జూన్ । 2023



చేసేందుకా.. కాజేసేందుకా?
ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. నీటి ప్రవాహం పేరిట కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారు. - 8లో



గార్ల ఎంపీపీపై దాడి
గార్ల ఎంపీపీపై జరిగిన దాడి ఘటనలో 16మందిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33°/25°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గోవధ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



రాయపర్తి: బక్రీద్‌కు గోవధ జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్, యానిమల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ కమలేష్‌దాస్‌మహారాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని జయరాంతండా (శె)లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోవులను వధించకుండా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ జంతువులను చంపితే నాన్ బెయిలబుల్ కేసులు ఉంటాయని, ఆవులను చంపితే ఎలాంటి కేసులు ఉండకపోవడం సరికాదన్నారు. అంతరించిపోతున్న ఆవులు, దూడలకు షెడ్లను నిర్మించి పునరావాసం కల్పించాలని, ఏపీసీఏలో పేర్కొన్న విధంగా వైద్య సేవలందిస్తే గోవులను కాపాడవచ్చని తెలిపారు. సమావేశంలో శివశక్తి గోశాల ప్రెసిడెంట్ మంజ్యా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాయల శంకర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన డాక్టర్ చింతకాయల శంకర్ నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష చేతుల మీదుగా ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గురిజాల ఉద్యోగుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గొలనుకొండ వేణు, ప్రధాన కార్యదర్శి చుక్క రాజేందర్‌గౌడ్ తదితరులు శంకర్‌ను అభినందించారు.

కుమ్మరులకు ప్రత్యేక శిక్షణ



వర్ధన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తిలో నైపుణ్యాలను పెంపొందించడానికి కుమ్మరి కులస్తులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ తెలంగాణ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణరావు అన్నారు. కుంభార్ సశక్తి కరణ్ కార్యక్రమంలో భాగంగా ఇల్లంద గ్రామంలో కుమ్మరులకు గ్రామోద్యోగ్ యోజన ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి నారాయణరావు గురువారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత్రలు, విగ్రహాలు, పూలకుండీల తయారీలో శిక్షణ కుమ్మరులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పీఎం ఈజీపీ పథకాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమలు స్థాపించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు యాకయ్య, వెంకన్న, మొగిళి, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగరాజు, రాజు, రవి, సాయిరాం, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.4 లక్షల విరాళం



గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ ఊకల్‌హవేలి నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మహా మండప నిర్మాణం కోసం పలువురు భక్తులు గురువారం సాయం అందించినట్లు ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. ఊకల్‌హవేలికి చెందిన మాచనపల్లి బాబూరావు–సౌజన్య దంపతులు రూ.2 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన మట్టెపల్లి యాదగిరిరావు–రజిత దంపతులు రూ.లక్ష, పోలాటి సుకుమార్‌రావు–అర్చన దంపతులు రూ.లక్ష విరాళం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ మొగసాని నాగదేవత, ఎంపీటీసీ వీరారావు, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపల్లి బాబురావు, ఊకల్ సొసైటీ చైర్మన్ వీరస్వామి, కొత్తగట్టు రాజేందర్, బేతినేని రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

నరేంద్రజాలం తగ్గుతోందా..!



వరంగల్ తూర్పులో మార్పు మొదలైందంటూ చర్చ

- ఇన్నాళ్లు కట్టడి చేసిన కార్పొరేటర్లు చేజారుతున్న వైనం
- మొన్న విందుకు ఇద్దరు గైర్హాజరవడంతో జోరుగా చర్చ
- బల్దియాలో సమావేశానికి ఎమ్మెల్యే వెళ్లొద్దన్నారంటూ ప్రచారం
- అయినా అమరుల సంస్మరణ తీర్మానానికి తొమ్మిది మంది హాజరు
- రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరగొచ్చంటున్న పార్టీ శ్రేణులు

సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్‌లో వర్గ పోరు తారస్థాయికి చేరుకుంటోంది. ఇన్నాళ్లు వన్ మ్యాన్ షో చేస్తూ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్...ప్రతిసారి కార్పొరేటర్లపై విసిరే కట్టడి మంత్రం ఈసారి గతి తప్పిందన్న చర్చ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. ఇటీవల వరంగల్ తూర్పులో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ విజయవంతమైందని చెప్పుకుంటూ నిర్వహించిన విందు పార్టీకి 22మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను ఆహ్వానించినా ఇద్దరు డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర మంత్రి కేటీఆర్ మళ్లీ టికెట్ ఇస్తానన్న భరోసాను నరేందర్‌కు ఇవ్వకపోవడంతో ఇప్పుడు ఒక్కో కార్పొరేటర్ మెల్లిమెల్లిగా స్వతంత్రతను కోరుకుంటున్నారన్న టాక్ రాజకీయవర్గాల్లో ఉంది. ఇన్నాళ్లు ఎమ్మెల్యే మాటను జవదాటని వారు...నమ్మకస్తులు కూడా బల్దియా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ అమరులకు నివాళిగా తీర్మానం కోసం బల్దియా ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వరంగల్ తూర్పు నుంచి డిప్యూటీ మేయర్‌తో సహా 9 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, బోణి స్వర్ణలత, మరుపల్లి రవి, గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష, తేజస్విని, పల్లం పద్మతోపాటు తూర్పు నుంచి ఇద్దరు ఇండిపెండెంట్లు చందన, బస్వరాజుకుమార్ పాల్గొన్నారు. తూర్పులో 24 మందికి 11 మంది హాజరవగా, 13 మంది గైర్హాజరయ్యారు. అమరుల సంస్మరణ తీర్మానానికి హాజరుకాని కార్పొరేటర్లపై బీఆర్‌ఎస్ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

మొన్న రెండు... నేడు తొమ్మిది...

బల్దియాలో జరిగే కార్యక్రమాల్లో తాను ఓకే అంటేనే వెళ్లాలని ఇన్నాళ్లు హుకుం జారీ చేసిన ఎమ్మెల్యే నరేందర్ మాటను కార్పొరేటర్లు ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ అమరుల సంస్మరణ తీర్మానం కోసం గురువారం ఉదయం 11 గంటలకు జరిగిన సమావేశానికి కూడా వెళ్లొద్దని కార్పొరేటర్లకు చెప్పినట్టుగా తూర్పు రాజకీయవర్గాల్లో కోడై కూస్తోంది. ఈ మేరకు 13 మంది ఆ మీటింగ్‌కు దూరంగా ఉన్నా...9 మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు హాజరవడం చూస్తుంటే తూర్పు రాజకీయంలో మార్పు మొదలైందన్న చర్చకు దారి తీసింది. మొన్న ఇద్దరు...నేడు తొమ్మిది మంది...రేపు ఇంకొంత మంది పెరిగే అవకాశముందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ఏదిఏమైనా మంత్రి కేటీఆర్ వరంగల్ తూర్పు పర్యటన తర్వాత కార్పొరేటర్లకు స్వేచ్ఛ వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఎమ్మెల్యే మాటలకు అనుగుణంగా చాలావరకు కార్పొరేషన్ సమావేశాలకు కార్పొరేటర్లు అందరూ గైర్హాజరైన ఘటనలున్న విషయం తెలిసిందే.

అంతలోనే ఎందుకు ఇలా...

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరుల సంస్మరణ సందర్భంగా ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద అమరులకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నివాళులు అర్పించారు. కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, ఉమా దామోదర్, మరుపల్లి రవి, పోశాల పద్మ, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ముస్కా అరుణ సుధాకర్ పాల్గొన్నారు. ఆ తర్వాత బల్దియాలో జరిగిన కార్యక్రమానికి మాత్రం మరుపల్లి రవి, పల్లం పద్మ మాత్రమే హాజరయ్యారు. ఎమ్మెల్యే నరేందర్ నిలువరించడం వల్లనే కొందరు కార్పొరేటర్లు ఆ సమావేశానికి హాజరు కాలేదని రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఏదిఏమైనా ఎమ్మెల్యే నరేందర్ కార్పొరేటర్లను కట్టడి చేసే మంత్రం వికటిస్తుండడంతో తూర్పు గులాబీలో తర్వాత నాయకత్వం ఎవరూ అన్న చర్చ సాగుతోంది. ఈ సీటుకు ముఖ్య నేతలు ప్రయత్నిస్తుండడంతో వరంగల్ తూర్పు రాజకీయం రసకందాయంగా మారిందని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

- భూపాలపల్లి సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

భూపాలపల్లి/భూపాలపల్లి రూరల్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని, సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలు మొత్తం చెల్లించి పరిరక్షిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బండి సంజయ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తన కూతురిని యూనియన్ నాయకురాలిని చేసి సంస్థను ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఓపెన్‌కాస్టులను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఇవ్వాల 17 ఓపెన్‌కాస్టులకు అనుమతి తీసుకున్నాడన్నారు. సింగరేణి నుంచి రూ. 25 వేల కోట్ల అప్పు ప్రభుత్వం తీసుకుందని, సంస్థను దివాలా తీయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నందుకు, ప్రజలను దారి మళ్లించేందుకు పీఎం మోదీ తనకు దోస్త్ అని సీఎం ప్రచారం చేసుకుంటున్నాడని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఉచిత వైద్యం, విద్య, ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని సంజయ్ హామీ ఇచ్చారు. సభలో రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు చందుపట్ల కీర్తిరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉదయ్‌ప్రతాప్, సునీల్‌రెడ్డి, పాపయ్య, రాజుగౌడ్, ఎరుకల గణపతి, మునీందర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

- గుండ్లపహాడ్ పోస్టాఫీస్‌లో పంపిణీ చేయని ఉత్తరాలు
- ఏడాది కాలంగా కార్యాలయంలోనే నిల్వ



పంపిణీ చేయకుండా గుండ్లపహాడ్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లో నిల్వ చేసిన ఉత్తరాలు

నల్లబెల్లి: మండలంలోని గుండ్లపహాడ్ బ్రాంచ్ పోస్టాఫీస్‌లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలను ఎప్పటికప్పుడూ పంపిణీ చేయాల్సిన బీపీఎం ఏడాది కాలంగా తన కార్యాలయంలోనే అక్రమంగా నిల్వచేసి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పోస్టాఫీస్‌కు వచ్చిన ఆధార్‌కార్డులు, వినియోగదారుల ఎస్‌బీఐ అకౌంట్ పాస్‌బుక్స్, చెక్‌బుక్స్, క్రెడిట్ కార్డులు, బ్యాంకు రికవరీ నోటీసులు, ఉద్యోగాల కాల్ లెటర్స్‌ను పంపిణీ చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై గుండ్లపహాడ్ బీపీఎం సతీష్‌ను వివరణ కోరగా తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు వారాలుగా ఉత్తరాలు పంపిణీ చేయలేదు. పోస్టాఫీస్‌కు వచ్చిన ఉత్తరాలన్నింటినీ రెండు రోజుల్లో పంపిణీ చేస్తా. రెండు నెలలకు సంబంధించినవి పోస్టాఫీస్‌లో ఎందుకు అక్రమంగా నిల్వచేశారని ప్రశ్నిస్తే సమాధానం దాటవేశారు.

అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- ముగిసిన దశాబ్ది ఉత్సవాలు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్ది, ప్రజాప్రతినిధులు

నర్సంపేట: అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్తూపం, అమరుడు రాజ్‌కుమార్ విగ్రహం, చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. అమరులు కోరుకున్న విధంగానే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వేడుకల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత కీర్తి ప్రతిష్టలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



వర్ధన్నపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనతో భారత కీర్తిప్రతిష్టలు ఎంతో పెరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. వర్ధన్నపేట పట్టణంలో బూత్ నంబర్ 192లో గురువారం పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజుతో కలిసి కొండేటి శ్రీధర్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా 3 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 11.72 కోట్ల టాయిలెట్ల నిర్మాణం, ముద్ర యోజన ద్వారా 27.6 కోట్ల మహిళలకు రుణాలు, మాతృవందన యోజన ద్వారా 3.3 కోట్ల మంది మహిళలకు సాయం, మహిళా ఉద్యోగులకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 390 నూతన విశ్వవిద్యాలయాలు, ఏడు ఐఐటీలు, ఏడు ఐఏఎంలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. యువతకు కౌశల్ వికాస్ యోజన ద్వారా శిక్షణ, పీఎం శ్రీ యోజన ద్వారా 14,500 పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాల్లోనే భారత్ గొప్పదని నిరూపించారన్నారు. 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ చేసి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్దూరి రాజ్‌కుమార్, కొండేటి సత్యం, వెలమకంటి గిరిప్రసాద్, బొంపెల్లి దేవేందర్‌రావు, సోమేశ్వర్‌రావు, తేజానాయక్, బాల్య విక్రమ్, ఆంగోతు దేవేందర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 29 మంది డీబార్

కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలో గురువారం నిర్వహించిన డిగ్రీ రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌కు పట్టుబడి 29 మంది డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. నర్సంపేట బాలాజీ మహిళా కళాశాలలో ఇద్దరు, సిద్ధార్థ కళాశాలలో ఒకరు, తొర్రూరు సమత కళాశాలలో ముగ్గురు, మహబూబాబాద్‌లోని విజ్ఞాన భారతి కళాశాలలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నలంద కళాశాలలో ఇద్దరు, పరకాలలోని ఎంఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలోఒకరు, భూపాలపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, సత్తుపెల్లిలోని కాకతీయ కళాశాలలో ముగ్గురు, భద్రాద్రి కొత్తగూడెం కళాశాలలో ఒకరు, ఉట్నూరు వాగేశ్వరి కళాశాలలో ఒకరు, ఇచ్చోడలోని వివేకానంద కళాశాలలో ఏడుగురు, ఛత్రపతి కళాశాలలో నలుగురు విద్యార్థులు కాపీయింగ్ చేస్తూ డీబార్ అయినట్లు వారు తెలిపారు. కాగా.. వరంగల్ ఎల్‌బీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని గురువారం కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

1001 వరి రకం సాగు చేయొద్దు

- రైస్ మిల్లర్ల సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు ఇరుకు కోటేశ్వర్‌రావు



దుగ్గొండి: కరపత్రాలను చూపిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, రైస్ మిల్లర్లు



నర్సంపేట: సీడ్స్ షాపు యజమానులకు కరపత్రం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

దుగ్గొండి: అన్నదాతలు వానాకాలంలో 1001 రకం వరి పంటను సాగు చేయవద్దని, తాము ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయమని రైస్ మిల్లర్ల సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు ఇరుకు కోటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గిర్నిబావిలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్‌ను గురువారం కలిశారు. ఈ సందర్భంగా కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ దొడ్డు రకం ధాన్యాన్ని రైతులు సాగు చేయకుండా చూడాలని సూచించారు. దొడ్డు రకం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ప్రాసెసింగ్ చేసే క్రమంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. మిల్లర్లు ఎప్పుడూ అన్నదాతల వైపే ఉంటారని, వారు బాగుంటేనే మిల్లులు నడుస్తాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల సంఘం నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి విభూతి శివకుమార్,కోశాధికారి కోమాండ్ల భూపాల్‌రావు, జిల్లా కోశాధికారి తక్కల్లపల్లి యుగంధర్‌రావు,జంగా రాజిరెడ్డి,పాలకుర్తి శ్రీనివాస్, శంకర్ నాయక్,రవికుమార్,సొసైటీ మాజీ చైర్మన్ గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి,తిరుపతి,లింగయ్య పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

నర్సంపేట: నర్సంపేట డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1001ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని ముద్రించిన కరపత్రాలను నర్సంపేట పట్టణంతో పాటు నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లోని విత్తన షాపులకు వెళ్లి పంపిణీ చేశారు. రైస్ మిల్లర్స్ డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని సీడ్స్ షాపులు, ఫర్టిలైజర్స్ షాపులు, వీఎఫ్‌జీ సొసైటీ షాపుల నిర్వాహకుల వద్దకు వెళ్లి 1001 ధాన్యం వల్ల కలుగుతున్న నష్టాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. అనంతరం ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి విభూది శివకుమార్, కోశాధికారి భూపాలరావు, జిల్లా కోశాధికారి తక్కళ్లపల్లి యుగేందర్, ప్రణయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

27న స్పాట్ అడ్మిషన్లు

సంగెం: మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్/కళాశాలలో ఇంటర్‌లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి 27వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముజుబుర్ రహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా రోస్టర్ పద్ధతిలో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆస్తకి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ టీసీ, స్టడీ, ఆధార్, కులం, ఆన్‌లైన్ మెమో, ఫొటోలు తీసుకుని వచ్చి కళాశాలలో సంప్రదించాలని కోరారు.

స్టాంప్ వెండర్ల ఇష్టారాజ్యం

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంప్ వెండర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఆన్‌లైన్‌లో స్టాంప్స్ విక్రయించాలని నెలక్రితం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ స్టాంప్ వెండర్లు ఆఫ్‌లైన్‌లోనే విక్రయాలు కొనసాగిస్తున్నారు. కాగా.. గురువారం వరంగల్ ఆర్‌ఓ కార్యాలయంలోని ఉన్నతాధికారులు ఆఫ్‌లైన్‌లో స్టాంప్స్ విక్రయిస్తున్న వారిని మందలించి, ఆన్‌లైన్‌లో విక్రయాలు కొనసాగించకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

ఐదుగురికి ఏసీపీలుగా పదోన్నతి

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లకు ఏసీపీలుగా పదోన్నతి లభించింది. ఈమేరకు డీజీపీ అంజనీకుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌జీ, విజయ్‌కుమార్, సతీశ్‌బాబు, రమేశ్‌కుమార్ ఉన్నారు. వీరికి పోలీస్ అధికారులు అభినందనలు తెలిపారు.

పాఠశాలకు దారిలేక అవస్థలు

- పొలం గట్లపై నుంచి వెళ్తుండగా ప్రమాదాలు
- చేయి విరిగి ఉపాధ్యాయురాలి ఇబ్బందులు



విరిగిన చేయిని చూపిస్తున్న ఉపాధ్యాయురాలు షకీరాబేగం

వర్ధన్నపేట : ప్రాథమికోన్నత పాఠశాలకు దారి లేక పొలం గట్లపై నుంచి వెళ్తుంటే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాంధన్‌తండాలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు దారి లేదు. కొన్నేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పొలం గట్ల వెంట ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. ఈక్రమంలో బుధవారం పాఠశాల ఉపాధ్యాయిని షకీరాబేగం పంట చేల నుంచి నడిచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో చేయి విరిగి నానా అవస్థ పడింది. ఈ విషయాన్ని గురువారం సర్పంచ్ గుగులోతు లక్ష్మీగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

సర్వేను సక్రమంగా చేపట్టాలి



ఓటరు లిస్టు సవరణ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఖానాపురం: గ్రామాల్లో బీఎల్‌ఓలు నిర్వహించే ఓటరు లిస్టు సవరణ సర్వేను సక్రమంగా చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు మండలంలోని ఐనపల్లిలో బీఎల్‌ఓలు చేపట్టిన సర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నమోదు విధానం, సేకరించాల్సిన అంశాలపై సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేలో నమోదు చేయాల్సిన విషయాల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఇంటి నంబర్లు తప్పుగా ఉంటే సరి చేయాలని, ఎవరైనా మృతి చెందినా, ఊరు వదిలి వెళ్లినా జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జూలూరి సుభాషిణి, వీఆర్‌ఏలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పద్ధతిలో నియామకాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు ఆ బీసీ గురుకులాల ఆర్‌సీవో వై మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో విద్యబోధన చేయాల్సి ఉంటుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో విద్యాబోధన చేయాల్సింటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లతో హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఈనెల 26న తెలుగు, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు, 27న సైన్స్, ఇంగ్లిష్ ,హిందీ సబ్జెక్టులకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9154102639, 9550064323 నంబర్లను సంప్రదించాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ తోపాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ హత్యపై విచారణ..?

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై పోలీసులు పలువురిని విచారిస్తున్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన దాదాపు 40 మందిని స్టేషన్‌కు తీసుకొచ్చి వారి కాల్ డేటాతోపాటు పలు వివరాలు సేకరించారు. కాగా, రామకృష్ణయ్యను గిరబోయిన అంజయ్య ఈనెల 15న హత్య చేయించిన విషయం పోలీసుల విచారణలో వెల్లడైంది తెలిసిందే. అదే రోజు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి ఇంటి ఎదుట పలువురు సంబురాలు జరుపుకున్న అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ విందులో పాల్గొన్న వారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు.. సంబురాలు ఎందుకు చేసుకున్నారనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకేమీ తెలియదని చెబుతున్నారు.

అరేళ్ల తర్వాత హడావుడిగా చేపట్టిన హనుమకొండ పెగడపల్లి డబ్బాల సమీపంలో కాకతీయ ప్రధాన కాల్వల ఆధునీకరణ పనులు



చేసేందుకా... కాజేసేందుకా?

ఆరేళ్లుగా పెండింగ్‌లో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ

- రూ.873.61 కోట్లతో 83 పనులు.. 2018లో పూర్తయిన టెండర్లు
- కాల్వల్లో నీటి ప్రవాహం పేరిట కాలయాపన....
- హడావుడిగా రూ.122.90 కోట్ల పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్లు
- మళ్లీ వర్షాలు పడే ముందు మొదలెట్టడంపై అనుమానాలు
- ఫలహారంగా కాకతీయ కాల్వల ఆధునీకీకరణ నిధులు
- గతంలో డీబీఎం 38, 48 పనుల్లో అక్రమాలు.. సొంతశాఖ నుంచే ఫిర్యాదులు..
- ఇంకా కొనసాగుతున్న 'విజిలెన్స్'విచారణ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్–1 కాకతీయ ప్రధాన కాలువల ఆధునికీకరణ నిధులు కొందరు అధికారుల, కాంట్రాక్టర్లకు ఫలహారంగా మారాయి. ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం, ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోంది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతుండడంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ గీసుకొండ, పర్వతగిరి ప్రాంతాల్లో డీబీఎం–38, డీబీఎం–48లలో జరిగిన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయి. సుమారు రూ.100 కోట్ల పనుల్లో 25 శాతం వరకు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత మిగతా పనులు కూడా నిలిపి వేశారు. జగిత్యాల ఏరియాలో రూ.51.16 కోట్లు, ఎల్ఎండీ పైన రూ.32.24 కోట్లతో పనులు పూర్తి కాగా, ఎల్ఎండీపరిధిలోని 146 కి.మీ.ల నుంచి 191 కి.మీ.ల వరకు రూ.133.51 కోట్ల పనులు చాలా చోట్ల పెండింగ్‌లో పెట్టారు. అదే విధంగా రూ.122.09 కోట్లు కేటాయించిన 191 కి.మీ.ల నుంచి 234 కి .మీ.ల (తాడికల్ నుంచి కేయూ క్యాంపస్ సమీపం) వరకు కూడా పనులు చేయలేదు. ఆరేళ్లుగా కాల్వల్లో నీటి ప్రవాహం ఉందని కారణంగా కాలయాపన చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు.. సరిగ్గా వానాకాలం ఆరంభానికి ముందు.. పదిహేను రోజుల కిందట మళ్లీ పనులు మొదలెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేసేందుకా?.. గతంలో లాగే కాజేసేందుకా? అన్న చర్చ జరుగుతోంది.



తూతూ మంత్రంగా..సాగుతున్న హనుమకొండ యాదవనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు

డీబీఎం–38,48 పనులపై సాగుతున్న 'విజిలెన్స్'విచారణ...

వరంగల్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్‌పీ, డీబీఎం 48 సీసీహెచ్ డివిజన్ నంబర్ 4 పరిధిలోని తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు ఆధునికీకరణ పనుల కోసం రూ.123కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డీబీఎం 48, 1ఆర్ 2ఎల్, 3ఎఆర్, 6ఎల్, 10ఆర్, 1,13 ఆర్, 16 ఆర్, 17 ఎల్, 21ఆర్, 24 ఆర్, 25 ఎల్, 26 ఎల్, 27 ఎల్, 28 ఆర్, 29 ఎల్, 30 ఆర్, 31 ఎల్, 32 ఎల్, 34 ఆర్, 35 ఎల్, 26 ఆర్, 38 ఆర్ ఉప కాల్వల అభివృద్ధి, ఎర్త్ వర్క్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, ఈ పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17 కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని, డబ్బులు డ్రా చేసుకున్నారన్న ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ఇంకా సాగుతోంది. డీబీఎం 38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో డోవెల్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్‌ల అభివద్ధి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగంపైన విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ఆరేళ్ల పెండింగ్‌లో ఉన్న పనులను వర్షాకాలం ముందు ప్రారంభించడం వల్ల మళ్లీ నాసిరకం పనులతో నిధులు కాజేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆరేళ్ల కిందట రూ.873.61 కోట్లు..

ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ కోసం 2017లో 83 పనుల కోసం రూ.873.61 కోట్లు జీఓఎంఎస్ 67 ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్మల్ జిల్లా పోచంపాడు నుంచి (0.000 కి.మీ.ల నుంచి 284.000 కి.మీ.ల) ఖమ్మం జిల్లా తీర్థాల వరకు ప్రధాన కాల్వల ఆధునికీకరణతోపాటు లక్ష్మీ కెనాల్, సరస్వతి కెనాల్, సదర్మాట్‌ల మెయింటనెన్స్ పనులకు నిధులిచ్చారు. ప్రధానంగా కాకతీయ ప్రధాన కాల్వ ఏడు పనుల కోసం రూ.385.56 కోట్లు, 63 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.356.14 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.873.61 కోట్లలో రూ.741.70 కోట్లు ప్రధాన కాల్వల ఆధునికీరణకు ఇచ్చారు. ఈ పనులకు 2018లో టెండర్లు జరగగా, వరంగల్, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన కొందరు కీలక ప్రజాప్రతినిధులు అసలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి వారి బినామీ కాంట్రాక్టర్లకు సబ్ కాంట్రాక్ట్‌కింద పనులు కట్టబెట్టారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. సాగదీస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాల్వల్లో నీరుండడం వల్లే ఆలస్యం..

2018 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి కాల్వల్లో నీళ్లు ఉండటం వల్లే ఆలస్యం జరిగింది. రూ.122.09 కోట్ల వ్యయంతో 191–234 కిలోమీటర్ల వరకు చేయాల్సిన పనులకు గాను 202 కి.మీ.ల వరకు పూర్తయ్యాయి. చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రస్తుతం 202–234 కి.మీ.ల వరకు పనులు చేపట్టారు. నాణ్యతాప్రమాణాల ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ, జలవనరుల శాఖ

రీ-ఆర్గనైజేషన్ వల్ల ..

కాకతీయ ప్రధాన కాల్వల పునరుద్ధరణ పనుల పూర్తికి నీటి ప్రవాహంతో పాటు నీటి పారుదల శాఖ రీ–ఆర్గనైజేషన్ కారణంగా ఆలస్యమైంది. ఏఈఈలు మొదలు చీఫ్ ఇంజనీర్ల వరకు మారి, కొత్త వాళ్లు వచ్చారు. ఈ వానాకాలంలోనైనా చివరి ఆయకట్టుకు నీరందాలంటే ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని మొదలు పెట్టాం. వర్షాల ఉధృతి పెరగకముందే పూర్తి చేస్తాం.

– సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జలవనరులశాఖ

పథకం పేరు: ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ	
మొత్తం పనులు:	83
మంజూరైన నిధులు:	రూ.873.61 కోట్లు
పనులు ప్రారంభం:	2018 జనవరి
స్థిరీకరించిన ఆయకట్టు :	13.70 లక్షల ఎకరాలు

గార్ల ఎంపీపీపై దాడి

- 16 మందిపై కేసు



ఎంపీపీపై దాడి చేస్తున్న రాంసింగ్ అనుచరులు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల ఎంపీపీ ఎం శివాజీచౌహాన్‌పై దాడికి పాల్పడిన ఘటనలో 16 మందిపై గురువారం కేసులు నమోదయ్యాయి. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం మండలంలోని పెద్దకిష్టాపురానికి చెందిన జీ రాంసింగ్ బుధవారం రాత్రి తిర్లాపురంలోని బంక్‌కు వెళ్లి పెట్రోల్ పోయించుకున్నారు. అనంతరం పెట్రోల్ బాయ్ సాయికి రూ. 2వేల నోటు ఇవ్వగా, తమ యజమాని రూ.2వేల నోటు తీసుకోవద్దన్నాడని.. ఫోన్‌పే చేయమని కోరాడు. దీంతో రాంసింగ్..రూ. 2వేల నోటు ఎందుకు తీసుకోవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారును మూవ్ చేశారు. ఈ క్రమంలో కారు ఆపమని డోర్ పట్టుకున్న సాయి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. పెట్రోల్ బాయ్ కేకలు వేయడంతో గ్రామస్తులు రాంసింగ్ కారును ఆపారు. ఈలోపు పెట్రోల్ కోసం వచ్చిన ఎంపీపీ శివాజీ చౌహాన్ విషయం తెలుసుకుంటుండగా ఎంపీపీపై కూడా రాంసింగ్ దురుసుగా ప్రవర్తించడంతో ఎంపీపీ మందలించాడు. దీనిని దృష్టిలో ఉంచుకున్న రాంసింగ్ గురువారం ఉదయం తన అనుచరులతో గార్లకు వచ్చి ఎంపీపీపై దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీపీతో పాటు అతని తమ్ముడు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎంపీపీ ఫిర్యాదు మేరకు రాంసింగ్‌తో పాటు అతని అనుచరులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపాడబోయి.. కనిపించని లోకాలకు..

- విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



కొమ్మయ్య మృతదేహం

సంగెం: ఇనుప దండెంపై తడిబట్టలు ఆరవేస్తున్న మహిళకు కరెంట్ షాక్ తగలడంతో ఆరుపులు విని కాపాడబోయి అదే తీగ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కాపులకనిపర్తికి చెందిన సదిరం కొమ్మయ్య(57) ఇంటి ఎదుట గల ఇనుప దండెంపై పక్కంటికి చెందిన సదిరం రమ తడి బట్టలు ఆరవేస్తోంది. ఈ క్రమంలో దండెంకు కరెంట్ సరఫరా వచ్చి రమ విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. అక్కడే ఉన్న కొమ్మయ్య రమ విడిపించే ప్రయత్నంలో దండెంకు తగలగా విద్యుత్ షాక్‌క గురై అక్కడిక్కడే మృతి చెందాడు. రమ తీవ్రగాయంతో స్పృహతప్పి పడిపోయింది. రమను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

'గీతం'లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

- యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయకుమార్

హన్మకొండ అర్బన్ : జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2023–2024 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని సుప్రభ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు. ఈ నాలుగేళ్ల కోర్సుల ద్వారా విద్యార్థులు క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటన నైపుణ్యాలతో పాటు, కళలు, మానవీయ శాస్త్రాలు, మేనేజ్‌మెంట్, సైన్స్‌లోని అంతర్ విభాగ పాఠ్యాంశాలను అభ్యసించొచ్చని తెలిపారు. గీతం నూతనంగా తీసుకువస్తున్న లిబరల్ ఎడ్యుకేషన్ (ఉదార విద్య) ద్వారా విద్యార్థులు బీఏ, బీబీఏ, బీఎస్సీలలో దేనిలో చేరినా మొదటి సెమిస్టర్‌లో మొత్తం ఒకేరకమైన పాఠ్యాంశాలను అభ్యసిస్తారని, రెండో సెమిస్టర్‌లో విద్యార్థులు కావాలనుకుంటే ఈ మూడింటిలో ఒకదానిలో నుంచి మరో కోర్సుకు మారవచ్చన్నారు. దేశంలో 19 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా 105 వర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. అందులో గీతం కూడా ఒకటి ఆయన తెలిపారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



వంశీ మృతదేహం

జనగామ రూరల్ : జ్వరంతో బాధపడుతున్న ఓ మూగ యువకుడిని చికిత్స నిమిత్తం జనగామలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిన కొద్ది గంటలలోనే మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌కు చెందిన కర్రె వంశీ (18) జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం ఆస్పత్రికి తీసుకురాగా మొదట ఈసీజీ తీసిన వైద్యులు.. అనంతరం అడ్మిట్ చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు వైద్యం చేస్తుండగా మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి..

ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి తీసుకొచ్చినా 11 గంటల వరకూ వైద్యం చేయకపోవడంతోనే ఆరోగ్య పరిస్థితి విషమించి వంశీ మృతి చెందాడని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. 11.30 గంటలకు ఇంజక్షన్ ఇచ్చిన తరువాత 11. 45 గంటలకు మృతి చెందాడని వైద్యులను నిలదీశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజును వివరణ కోరగా వంశీకి ఆస్పత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే వైద్యం అందించారని తెలిపారు.

చంద్రయ్యపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడు..



అనిల్(ఫైల్)

నల్లబెల్లి: అజాగ్రత్తతో బైక్ నడిపిన ఓ యువకుడు.. గైడ్ పోస్టును ఢీకొని వాగులో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలుకాగా స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన పాండవుల రమణమ్మ, రాజన్న దంపతుల కుమారుడు అనిల్(24) నల్లబెల్లి రెడ్‌మిక్స్ ప్లాంట్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం శనిగరం క్రాస్‌లో వ్యక్తిగత పనులు ముగించుకున్న అనిల్.. బైక్‌పై నల్లబెల్లి వైపు వస్తూ అజాగ్రత్తతో మధ్యలవాగు గైడ్ పోస్టును ఢీకొన్నాడు. దీంతో బైక్‌తో సహా వాగులో పడిపోగా తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

కంచనపల్లిలో మరో యువకుడు..



రమేశ్(ఫైల్)

రఘునాథపల్లి: అకారణంగా భార్య కేసు పెట్టిందని మనస్తాపానికి గురైన భర్త.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కొడగాని రమేశ్ (28)కు అదే గ్రామానికి చెందిన కాంటెవాడ పెద్ద సోమయ్య కూతురు సునీతతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాది క్రితం దంపతులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడ గొడవలు జరగడంతో భార్య సునీత.. భర్త పై ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనోవేదనకు గురైన రమేశ్ కంచనపల్లికి వచ్చి తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రైతులకు పైసా పరిహారం ఇవ్వలే..

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ఎస్ఎస్ తాడ్వాయి: ఈ ఏడాది ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.11 వేల పరిహారం చెల్లిస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేట నుంచి చేపట్టిన 'తెలంగాణ బచావో' యాత్ర గురువారం మేడారంలో ముగిసింది. యాత్ర ముగింపు పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను దోపిడీకి గురిచేయడంతో వారు ఎక్కడపడితే అక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లకు మద్యం, పైసలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. మేడారం జాతర అభివృద్ధికి కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం.. మేడారానికి సమీపంలోనే ఉన్న ఎల్బాక గ్రామంలో చిన్న లోలెవల్ కాజ్‌వే కూడా నిర్మించలేదని మండిపడ్డారు. ఈ జాతర అభివృద్ధిపై ప్రజలతో కమిటీ వేసి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్.. వచ్చే ఎన్నికల్లో పైసా ఖర్చు పెట్టకుండా గెలుస్తామని చెప్పారని, అదే సవాల్‌గా తీసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జేఏసీ జిల్లా చైర్మన్ చాప బాబు దొర, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

లింగాలఘణపురం: పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీలోపు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి చేపట్టిన బస్సు యాత్ర గురువారం మండలంలోని పటేల్‌గూడెం సమీపంలోని గుడిసెవాసుల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా గుడిసెవాసుల కాలనీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి నగర్‌గా నామకరణం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వీరయ్య మాట్లాడారు. ఇళ్లులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నాయని, కోట్ల విలువైన భూమిని ఎందుకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. పేదలకు రోడ్ల వెంట ఇళ్లు అవసరంలేదా.? కొండలు, గుట్టల్లోనే ఉండాలా అంటూ ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలంటూ ఏడాది నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ప్రాంతాల్లో భూపోరాటం సాగుతుందని, ఈ నెల 18న చేపట్టిన బస్సు యాత్ర 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందని, అప్పటి వరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, బస్సు యాత్ర బృందం నేతలు పద్మ, జగదీశ్, శోభన్, ఆనంద్, కనకారెడ్డి, రాజు, చందు, యాదగిరి, సోమయ్య, గోపి, శ్రీనివాస్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా విద్యాసాగర్‌రావు

- 17మందితో కమిటీ ఏర్పాటు

వరంగల్: టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గురువారం జాబితాను విడుదల చేశారు. పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడిగా అర్శనపల్లి విద్యాసాగర్ రావు (వరంగల్ పశ్చిమ), ఉపాధ్యక్షుడిగా జీఎల్ శ్రీధర్ (వరంగల్ తూర్పు), రెగూరి వెంకట్‌రెడ్డి(పరకాల), బర్ల యాకూబ్ (వరంగల్ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా నల్లకుంట రవికుమార్ (వరంగల్ తూర్పు), చొల్లేటి కృష్ణారెడ్డి(స్టేషన్ ఘనపూర్), అధికార ప్రతినిధులుగా గంగబోయిన రవీందర్ (పరకాల), బొలగాని చిత్తరంజన్ (పాలకుర్తి), కార్యాలయ కార్యదర్శిగా పిట్టల శ్రీనివాస్ (వర్ధన్నపేట), కోశాధికారిగా కాగితాల జయశంకర్ (వరంగల్ పశ్చిమ), కార్యనిర్వాక కార్యదర్శులుగా రేగుల సదయ్య(పరకాల), మాచర్ల నగేశ్(భూపాలపల్లి), కార్యదర్శులుగా హరిదాస్యం సురేశ్(వరంగల్ తూర్పు), లాడే రవీందర్(పరకాల), కేదాసి స్వామి (పరకాల), తాటికాయల అనిల్(వర్ధన్నపేట), మాడగాని మనోహర్(వరంగల్ పశ్చిమ) నియమితులయ్యారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణను పరిగణలోకి తీసుకొని ముఖ్య నాయకులతో చర్చించి పూర్తిస్థాయి పార్టీ కమిటీని ఎంపిక చేశామని జ్ఞానేశ్వర్ తెలిపారు.